కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైంది. అన్ని ప్రాంతాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిరసనలతో హోరెత్తించారు. సంక్షేమం, అభివృద్ధిని అటకెక్కించారంటూ కూటమి పాలనపై నేతలు మండిపడ్డారు.



పెనుకొండ: ప్లకార్డు చేతబట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నిరసన ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' సక్సెస్
- నిరసనలతో హోరెత్తించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- కూటమి పాలనపై నేతల మండిపాటు

పెనుకొండ రూరల్: గొంతు ఎత్తి అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టే కొత్త సంస్కృతికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. పెనుకొండ పట్టణంలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగానే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ గిరిధర్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సాధ్యంకాని హామీలు ఇచ్చిన కూటమి నేతలు ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత హామీలను విస్మరించారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసి అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. సంక్షేమాభివృద్ధి చేయకపోయినా ఏడాదిలోనే దాదాపుగా రూ.కోట్ల అప్పు ఎందుకు చేశారో చెప్పాలన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌దేనని స్పష్టం చేశారు. బీసీలకు ఏదైనా మంచి చేసిన ప్రభుత్వముంటే అది వైఎస్సార్‌సీపీనేనన్నారు. దీనికి మంత్రి సవిత చర్చకు రావాలని సవాల్ విసిరారు. కడపలో వైఎస్సార్ విగ్రహానికి జెండాలు కట్టడం సరికాదన్నారు. విగ్రహాలకు జెండాల కట్టే సంస్కృతికి టీడీపీ బీజం వేసిందన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు ఏకంగా టీడీపీ నాయకుల ఇళ్లకు వైఎస్సార్‌సీపీ జెండాలను కట్టే రోజు వస్తుందన్నారు. చంద్రబాబు పార్టీ కోసం మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిస్తే.. ఎమ్మెల్యే సీటు కోసం తన మామ పార్థసారథికి మంత్రి సవిత వెన్నుపోటు పొడిచారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధ్యక్షుడు గోరంట్ల రాజారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహమూర్తి, ప్రచార విభాగం అధ్యక్షుడు పాలసముద్రం పక్రుద్దీన్, జిల్లా యాక్టివిటీ సెక్రటరీలు నరేంద్రరెడ్డి, అంజినాయక్, పెనుకొండ పట్టణ, మండల కన్వీనర్లు సుధాకర్‌రెడ్డి, నరసింహులు, పరిగి, సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల మండలాల కన్వీనర్లు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాధ్యక్షుడు కొండలరాయుడు, చెన్నకేశవులు, న్యాయవాదులు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వంచనకు కేరాఫ్ చంద్రబాబు



హిందూపురం: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిలమత్తూరు: వంచనకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. బుధవారం హిందూపురం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహించారు. చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్, హిందూపురం పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించిన నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో చేసిన పాపాలు తప్ప చెప్పుకోవడానికి మంచి ఏదీ లేదని మండిపడ్డారు. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దోపిడీలు తప్ప రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చారని, ఇలాంటి ప్రభుత్వం కొనసాగడం అవసరమా అంటూ ప్రశ్నించారు. ఇలాగే నిర్లక్ష్యంగా ఉంటే తాము చూస్తూ ఊరుకోబోమని, ప్రజలతో కలిసి రోడ్లెక్కుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ శివ, మున్సిపల్ వైస్ చైర్మెన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, ఫ్లోర్ లీడర్ అసిఫుల్లా, చిలమత్తూరు, లేపాక్షి మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, రాష్ట్ర యువజన విభాగం ఉప కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, సురేష్‌కుమార్‌రెడ్డి, గిరిష్, దిలీప్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి,పట్టణ అధ్యక్షురాలు కవిత, ఎంపీటీసీలు ధనుంజయ రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, నేతలు నాగరాజు, అమరనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి మింటు, నవీన్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై సీఐ అక్కసు

ఒకటవ పట్టణ సీఐ రాజగోపాల్‌నాయుడు మరొసారి వైఎస్సార్‌సీపీ నాయకులపై తన అక్కసును ప్రదర్శించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీకి అనుమతి ఉంది. ఇందిరమ్మ విగ్రహం వద్ద ఉన్న దారి గుండా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే అవకాశం ఉంది. పోలీసులు ముందుగానే ఆ రోడ్డు క్లియర్ చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లాల్సిన రూట్ మ్యాప్ ప్రకారంగా ఇందిరమ్మ విగ్రహం నుంచి మరో 50 అడుగుల తర్వాత యూ టర్న్ ఉంది. ఆ రూట్ గుండా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంది. అయితే పోలీసులు ఇందిరమ్మ విగ్రహం వద్దనే ఆపేసి మళ్లించాలని చూశారు. 50 అడుగుల దూరమే కదా ఏమౌతుందని చెప్పినా వినకుండా ర్యాలీని అడ్డుకున్నారు. ప్రతిఘటించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీసులు అడ్డుకుంటున్నా ముందుకు సాగిపోయారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల దగ్గర మార్కుల కోసం మరీ ఇంత తాపత్రయమా అని స్థానికులు చర్చించుకున్నారు.

రెడ్‌బుక్ పేరుతో అరాచకం



మడకశిర: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మడకశిర: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఏడాది కూటమి పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం సృష్టించారని ధ్వజమెత్తారు. నిరంకుశ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. మడకశిర పట్టణంలో బుధవారం 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన తర్వాత వేలాది మందితో తహసీల్దార్ కారాయలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, దౌర్జన్యం చేయడం, అరాచకంగా వ్యవహరించడమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందన్నారు. చంద్రబాబుకు ఓట్లు వేసి గెలిపించి తప్పుచేశామని ప్రజలు బాధ పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, రొళ్ల జెడ్పీటీసీ, కుంచిటి వక్కలిగ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అనంతరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, మండల కన్వీనర్లు రామిరెడ్డి, త్రిలోక్‌నాథ్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, విజయరంగేగౌడ్, ఈరన్న, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మల్లికార్జున, శేషు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగన్న, గగన, జిల్లా బీసీ సెల్ కార్యదర్శులు శ్రీరాములు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



లేపాక్షి: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అమరాపురం: మడకశిరలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. ఎంపీపీ ఈరన్న, బీసీ, ఎస్సీ, ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు శివన్న, శివకుమార్, చిత్తన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, వైస్.ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నారాయణ, మాజీ మండల కన్వీనర్ అనిల్‌కుమార్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రొళ్ల: మడకశిర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పట్టిన వెన్నుపోటు దినం ర్యాలీకి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులతో కలిసి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు తరలివెళ్లారు.

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయకుండా ప్రజలకే వెన్నుపోటు పొడిచారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోఆప్షన్ సభ్యులు బషీర్, మాజీ ఎంపీపీ హనోక్, నాయకులు రామాంజినేయులు, మాధవరెడ్డి, అన్సార్, భాస్కర్‌రెడ్డి, బోర్ల అంజినరెడ్డి, చలపతి, చరణ్, నరసప్ప, శ్రీనివాసులు, తిప్పన్న, రామాంజి, జనార్దన్ బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హిందూపురంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

పరిగి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో పెనుకొండలో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.

ఘనంగా కన్వీనర్ జన్మదిన వేడుక

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీకె నరసింహమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పరిగిలో ఆ పార్టీ నాయకులు, స్థానిక సర్పంచ్ లక్ష్మీ శివశంకర్ ఆధ్వర్యంలో బర్త్‌డే కేకును కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



హిందూపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ వెంకటేషుకు వినతిపత్రాన్ని అందించారు. బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని, నిత్యవసర ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర, పట్టణ నాయకులు మహేష్, రామ్ చరణ్, హర్షవర్ధన్, గోవర్ధన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దార్ కరుణాకర్‌కు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ వినతిపత్రాన్ని అందించారు. పాత భవనాల స్థానంలో కొత్త భవనాలను ఏర్పాటు చేయాలని, సన్న బియ్యం పంపిణీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

పెనుకొండ రూరల్: సాంఘిక సంక్షేమ హస్టల్లో చదివే విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నాయకులు పవన్, భగత్ ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీనియర్ అసిస్టెంట్ వన్నూరప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నందీష్, కమిటీ సభ్యులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రతిపాదనలు పంపండి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి

రొళ్ల: ఉపాధి ద్వారా 2025–26 సంవత్సరానికి గాను మెట్ట ప్రాంతాల్లో పండ్లతోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులచే దరఖాస్తులు స్వీకరించి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీఓ ఓబుళప్పతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదెకరాల లోపు భూములు కలిగిన రైతుల పొలాల్లో వివిధ రకాల పండ్లతోటల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణ కింద ప్రతి నెల బిల్లులు చెల్లిస్తామన్నారు.

ఆటోడ్రైవర్ల గొడవ

హిందూపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం ఇద్దరు ఆటోడ్రైవర్లు గొడవ పడ్డారు. బాడుగ విషయంలో మాటమాటా పెరిగి దుర్భాషలాడుకున్నారు. మహబూబ్‌బాషాపై నూర్ మహ్మద్ దాడి చేయడంతో గాయపడినట్లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పెంచండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచేలా అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ సయ్యద్ మౌలా సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అలాగే యోగా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న యోగా తరగతులను పరిశీలించి, విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, తలుపుల కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవప్రసాద్, అధ్యాపకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెనుకొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్‌ఎస్‌ఓ మధుసూదన్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన స్థానిక సర్వజనాస్పత్రికి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులను సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమైన పలు సూచనలు చేశారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం: ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాలను మట్టితో సిద్ధం చేయడంతో పాటు 20 అడుగులు మించి ఎత్తులేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. వినాయక సేవా సమితి సభ్యులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గణేష్ పండుగ, నిమజ్జనం ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, హిందూ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ గోగ్రీన్ నినాదంతో విగ్రహాలన్నీ మట్టితో చేసినవి మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలన్నారు. ఊరేగింపులో డీజేలు లేకుండా సన్నాయి, మేళతాళాలు లాంటి వాటిని ఉపయోగించి భక్తిభావాం పెంపొందేలా చూడాలన్నారు. కోనేరు వద్ద వస్తున్న నీటి సమస్య, కోనేరు శుభ్రత పూడిక తొలగింపులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేష్, డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, కరీం, ఆంజినేయులు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీబీకి ఘన నివాళి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం: సంగీత ప్రపంచంలో గాన చక్రవర్తిగా నిలిచిపోయి తనకంటూ ప్రత్యేక చరిత్రను రాసుకున్న ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా ఓం క్రియేషన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కేంద్రం నిర్వాకులు ఘన నివాళులర్పించారు. బుధవారం స్థానిక పాండురంగనగర్‌లోని ఓం క్రియేషన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మరోవైపు పట్టణంలోని స్థానిక ఇందిరాపార్కులో పద్మశ్రీ ఘంటసాల కళామందిరంలో ఎస్పీబీ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన పాటలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కళామందిరం అధ్యక్షుడు ప్రసాద్‌రావు, ఆంజినేయులు, రిటైర్డ్ ఎస్ఐ లోకేష్, రామ్మూర్తి, లైఫ్ వరల్డ్ ఉదయ్, ఎంఈఓ గంగపప, శ్రీరాములు, మోహన్‌బాబు, శ్రీనివాసులు, అనిత, శబరి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒక్క హామీనైనా అమలు చేశారా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

లేపాక్షి: వెన్నుపోటు రాజకీయాల్లో చంద్రబాబును మించిన నాయకుడు లేరని మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక చేతన కన్వెన్షన్ హాల్‌లో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం చంద్రబాబు నిలుపుకోలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజునాథ, ఎంపీటీసీ సభ్యులు అశ్వత్థప్ప, ఆదినారాయణ, నాయకులు తిప్పన్న, శంకరప్ప, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్, జేకే ప్రభాకర్, ఇర్ఫాన్, శంకరరెడ్డి, గంగప్ప, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ నిర్మాణం వద్దు



ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు సమస్యను తెలియజేస్తున్న ప్రజలు

గుడిబండ: మండల పరిధిలోని తాళికెర పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు బుధవారం సాయంత్రం పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు సర్వే నంబర్ 890-2లో ఉన్న 18.06 ఎకరాల గ్రామకంఠం భూమిని పంచాయతీకి కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ రంగస్వామి, వివిధ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తాళికెర పంచాయతీ పరిధిలోని తిమ్మళాపురం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 890–2లో 18.06 ఎకరాల గ్రామకంఠం భూమి ఉందన్నారు. ఆ భూమిలో వంద చింత చెట్లు, పురాతన ఆంజనేయస్వామి ఆలయం, సంపద తయారీ కేంద్రం, పాలశీతల కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించడంతో పాటు గత ప్రభుత్వం హాయంలో ఇళ్లులేని నిరుపేదల కోసం 35 మందికి ఇంటి స్థలాలతో పాటు జీవనోపాధికి నర్సరీ కూడా ఉందన్నారు. ఇందులో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడితే తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సోలార్ ప్లాంట్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోను ఒప్పుకోవడం లేదని తేల్చి చెప్పారు.

ప్రతిభావంతులకు నేడు సన్మానం

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ కమ్యూనిటీ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నగోనపల్లి శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్మృతి వనంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



హిందూపురం: యోగాసనాలు చేస్తున్న పట్టణ ప్రముఖులు, అధికారులు

హిందూపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక కేంద్రం ఆవరణంలో బుధవారం ఉదయం యోగా డే నిర్వహించారు. డీఎస్పీ మహేష్, సీఐ రాజగోపాల్, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ శిష్యులు వెంకటస్వామి, సత్యనారాయణ, దాసరి శ్రీనివాసులు, రాంప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: గ్రామాల్లోని ప్రజలు నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో శిక్షకుడు లింగేష్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం పట్టణంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

ఏజెన్సీ సహాయకులకు శిక్షణ

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆజీజియా పాఠశాలలో ఎండీఎం ఏజెన్సీ సహాయకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంట ఎలా ఉండాలి, ఎలా చేయాలని అనే దానికిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన వంట కాంపిటీషన్లో అజీజియా పాఠశాలకు చెందిన అజమాతుల్లాఖాన్‌కు మొదటి బహుమతి, ఆర్టీసీ కాలనీ స్కూల్ గీతాకు రెండో బహుమతి, ముదిరెడ్డిపల్లి బాయ్స్ కీర్తికి మూడో బహుమతి, మోడల్ స్కూల్ ప్రభాకర్‌రెడ్డికి నాల్గో బహుమతి వచ్చినట్లు ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ తెలిపారు.